



**సునీల్ గవాస్కర్** బొటన వేలు పైకెత్తి తన ఆటగాళ్ళవైపు చూసి టాస్ గెల్చినట్టు సైగ చేసేడు. నేలమీద నాణాన్ని వంగి తీస్తున్న క్లైవ్ లాయిడ్‌తో 'బ్యాటింగ్' అన్నాడు.

వెస్ట్ఇండీస్‌కీ, భారత జట్టుకీ మధ్య జరుగుతూన్న మూడవ టెస్ట్ పోటీ అది. మొదటి రెండు టెస్టులూ డ్రా అవటంతో మంచి ఉత్సాహకరంగా ప్రారంభం కాబోతూంది.

గవాస్కర్ బ్యాటింగ్ అని చెప్పగానే ప్రకాష్ లేచి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు. రెండు నిముషాల్లో ప్యాడ్స్, గార్డ్సు కట్టుకున్నాడు. వెస్ట్ ఇండీస్ ఆటగాళ్ళు ఫీల్డులోకి ప్రవేశిస్తున్నారు. అంపైర్లు ముందే వెళ్ళిపోయారు. ప్రేక్షకులతో గాలరీలు అప్పటికే క్రిక్కిరిసిపోయాయి. వాళ్ళ అల్లరితో అంతా రణగొణ ధ్వనిగా ఉంది.

"బాగా ఆడు. బెస్ట్ ఆవ్ లక్" అన్నాడు విశ్వనాద్. క్రితం రాత్రి బీరుకొడుతూ తన మొదటి టెస్టు విశేషాలూ, ఎంత టెన్షన్‌తో ఆట ప్రారంభించిందీ చెప్తూంటే ప్రకాష్ శ్రద్ధగా విన్నాడు.

ముందు ఫీల్డింగ్ అయి ఉంటే ఆ వాతావరణం కొంచెం అలవాటు అయి ఉండేది. కానీ అలా కాలేదు. అదీగాక తను ఓపెనింగు రన్నర్! అతడికి కొద్దిగా భయంగా ఉంది.

గవాస్కర్‌తోపాటు డ్రెస్సింగ్ రూమ్‌లోంచి బయటికి వచ్చేడు ప్రకాష్. ఇద్దరు ముగ్గురు ఆటగాళ్ళు అభినందనలు తెలిపారు. ఆటగాళ్ళలో అతడికి అత్యంత సన్నిహితుడు కిర్మానీ నవ్వుతూ 'వెళ్ళిరా' అన్నట్టు బొటనవేలు పైకెత్తాడు.

మెట్లు దిగి, అతడు ఆటస్థలంలో ప్రవేశించాడు. అతడూ, గవాస్కర్ కలిసి బౌండరీ లైను దాటి లోపలికి వెళ్తూంటే ఆకాశాన్నంటేలా చప్పట్లు! ఆ చప్పట్లూ—తమ పట్ల వారికున్న అభిమానం—అంతా చూస్తూంటే అతడి ఒళ్ళు జలదరించింది. ఆ అవ్యక్తానందం జీవితంలో ఒక స్థాయికి చేరుకున్న కళాకారులకే తెలుస్తుంది—క్రికెట్ గానీ...రచన గానీ...అంతకాలం వరకూ పడిన కష్టపు ఫలితాన్ని అనుభవించటంలో ఉండే ఆనందం అది! ఏ ఫీల్డయినా ఒకటే!

దాదాపు వరుసగా ఆరు రంజీట్రోఫీల్లో సెంచరీ కొట్టాడు ప్రకాష్. ఆంధ్ర జట్టుకు ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టాడు. అతడు మంచి ఆవ్ స్పిన్నర్ కూడా. ఎన్నిక చేసే అధికారుల దృష్టి అతడిమీద పడి, సౌత్ జోన్‌కు ఎన్నుకున్నారు. అక్కడ కూడా అతడు తన బౌలింగ్‌తో వెస్ట్ ఇండీస్‌ని తికమక పెట్టటంతో, టెస్ట్‌కి సెలెక్ట్ చేశారు.

మెట్లు దిగుతూ అతడు ఓరగా డ్రెస్ సర్కిల్ పక్కకి చూసేడు. తనవైపే చూస్తున్న సైలజ పెదవుల్ని గుండ్రంగా చేసి గాలిలోనే అందించింది. చాలా జాగ్రత్తగా దాన్ని అందుకొన్నట్టు, నవ్వి తల పంకించాడు. ఆమె కళ్ళలో అభినందన కనిపిస్తూంది. ఆమె పక్కనే స్నేహితురాళ్ళు కూర్చున్నారు. తనకన్నా ఆమే ఎక్కువ ఎగ్జైట్‌మెంట్‌తో ఉన్నట్టు ఆమె కూర్చున్న విధానం తెలుపుతూంది. ప్రపంచ ప్రఖ్యాత

ఆటగాడు గవాస్కర్‌తో కలిసి స్థలం మధ్యకు నడవటాన్ని అతడు తన జీవితంలో మరిచిపోలేని అనుభవం. రెండు నిముషాల్లో వాళ్ళు వికెట్ వద్దకు చేరుకున్నారు. గవాస్కర్ ముందు బ్యాటింగ్.

భారతదేశపు బెస్ట్ అంపైర్ స్వరూప్ కిషన్‌కి రెండడుగుల దూరంగా నిలబడ్డాడు ప్రకాష్. గవాస్కర్ గార్డ్ తీసుకున్నాడు. ఆండ్రీ రాబర్ట్స్ బౌలింగ్. మొదటి బంతిని గవాస్కర్ ముందుకొచ్చి ఆడేడు. రెండు, మూడు, నాలుగు బంతుల్ని వదిలేసేడు. అయిదో బంతిలో రెండు పరుగులు తీసుకున్నాడు. ఆరో బంతి వదిలేసేడు.

ఓవర్ పూర్తి అయింది.

ఫీల్డర్స్ ఇట్నుంచి అటు మారుతున్నారు.

గవాస్కర్ మధ్యకొచ్చి ప్రకాష్‌తో అన్నాడు... "జాగ్రత్తగా ఆడు. మొదటి మూడు నాలుగు బంతులు ఆడగల్గితే, అలవాటయి పోతుంది. మొట్ట మొదట మ్యాచ్ కదూ. బెస్ట్ ఆవ్ లక్." ప్రకాష్ తలూపి తన స్థానంలోకి వచ్చాడు. అందరూ సర్దుకున్నారు.

ఉన్నట్టుండి ఆ ప్రదేశం, ఆటగాళ్ళూ, ప్రేక్షకులూ అంతా నిశ్శబ్దం అవటాన్ని అతడు గమనించేడు. కొన్ని వేలమంది జనం ఈ కొత్త ఆటగాడు ఎలా ఆడబోతున్నాడని గమనించటానికి ఉత్సుకతతో చూస్తున్నారు. ఆ నిశ్శబ్దంలో అతడి శరీరం వణికింది—చేతిలో బ్యాట్ కూడా! ఎవరికైనా అది తప్పదేమో—మొట్టమొదటిసారి టెస్ట్ బ్యాట్ పట్టుకున్నప్పుడు.

బవులింగ్ ఎవరు వెయ్యబోతున్నారు అని చూసేడు ప్రకాష్. ఎవరూ కనబడలేదు. అతడు కొద్దిగా కంగారుపడి, మరింత పరీక్షగా చూసేడు. దూరంగా బవుండరీ లైన్ దగ్గిర కనబడ్డాడు.

మైకేల్ హోల్డింగ్!

ప్రపంచంలోకెల్లా అతి వేగంగా బంతులు విసిరే వాళ్ళలో ఒకడు! బంతిని కుడి చేత్తో పట్టుకొని వస్తున్నాడు. అంతదూరం నుండి అతడు వస్తూంటే — అదే ఒక పరుగు పందెంలా ఉంది హోల్డింగ్ స్వీట్ బవులర్ అని ప్రతీతి. అతడు బంతి విసరటంలో పరుగెత్తటంలో రిథమ్ ఉంది. అతడు వికెట్ దగ్గిరగా వచ్చాడు. చెయ్యి తిప్పుతూ అంపైర్ని దాటేడు. ఆ తరవాత బంతిని వదిలిపెట్టాడు. అతడి చేతిలో ఉన్నంత సేపూ బంతి కనబడిం దంతే! ఆ తరవాత అది మాయమైంది. ఏదో చిన్న నలకలాటిది గాలి కన్నా వేగంగా దూసుకు రావటం తెలుస్తూంది. క్షణంలో వెయ్యవ వంతు తన పక్క నుంచి 'స్' మన్న శబ్దం చేసుకుంటూ ఏదో వెళ్ళిపోయింది. అతడు బ్యాట్ కొద్దిగా ఆఫ్‌సైడ్ జరిపేడు.

ఒక్కసారిగా ఆ నిశ్శబ్దంలోంచి సముద్రపు హోరు లాటి తరంగాల ధ్వని. విపరీతంగా జనం గోల!

ఏమైంది? బంతి స్లిప్స్ లోంచి బవుండరీ లైన్ దాటిందా! అతడు స్లిప్స్ వైపు చూసేడు అక్కడున్న ముగ్గురు ఫీల్డర్సూ బవులర్ని అభినందించటానికి వెళ్ళటం చూసి అప్పుడు చూసుకున్నాడు తన వికెట్ వైపు.

ఆఫ్ స్టంపు ఎగిరి దాదాపు నాలుగు అడుగుల దూరంలో పడి ఉంది.

■ ■ ■

# యండమూరి వీరేంద్రనాథ్



"ఇంత బేవార్సుగా ఆడతావని కలలో కూడా అనుకోలేదు. ఛీ" అంది శైలజ. ప్రకాష్ మాట్లాడలేదు.

"మా ఫ్రెండ్సందరూ ఎంతగా నవ్వుకున్నారో! కొంతమంది అడిగేసేరు కూడా—'ఏవోయ్, మీ వాడు అక్కడ భరతనాట్యం చేసేడేమిటీ అని.'"

ప్రకాష్ మొహం రోషంతో ఎర్రబడింది. అయినా అతడు ఆవేశాన్ని కంట్రోల్‌లో పెట్టుకున్నాడు. "నేనేం చెయ్యను? అక్కడ సరిగ్గా నర్దుకోలేకపోయాను. చాలా మంచి బంతి అది. ఎంత మంచి బంతి అంటే దానికి గవాస్కర్రా, విశ్వనాథూ అయినా కంగారు పడేవాళ్ళే! అదే ఫస్ట్ బాల్ అవటంతో మరింత కంగారుపడ్డాను." నన్నర్థం చేసుకోమన్నట్టు అతడు అభ్యర్థించేడు. కానీ శైలజ పరిస్థితి వేరుగా ఉంది. ఆమె, ప్రకాష్ ప్రేమించుకున్నారని చాలామందికి తెలుసు. చాలామంది ఈర్ష్యపడ్డారు కూడా. ప్రకాశ్ అందమైన వాడు. దానికి తోడు ఇండియన్ హోప్ వింగ్ బాట్స్‌మన్! అందుకే ఇలా అతడు ఓటమి చెందటం వారికి బాగా సంతృప్తి నిచ్చింది. ముఖ్యంగా శైలజ స్నేహితురాళ్ళమని చెప్పుకుంటున్నవారికి. ఆమెని ప్రొద్దున్నించీ, అంటే ప్రకాష్ అవుట్ అయిన దగ్గర్నుంచీ సాయంత్రం వరకూ ఏడిపిస్తూనే ఉన్నారు.

సాయంత్రానికల్లా ఇండియా బ్యాటింగ్ పూర్తయింది. మాట అరవై పరుగులకు అందరూ అవుట్ అయ్యారు.

మరునటి రోజు వెస్ట్ ఇండీస్ బ్యాటింగ్ ప్రారంభం అయింది గ్రీనిడ్జ్ హెయిన్స్ కలిసి డెబ్భై పరుగులు తీసేరు. లాయిడ్ నలభై పరుగులతో ఆడుతున్నాడు. ఇండియాని ఇన్నింగ్ డిఫీట్‌తో ఓడగొట్టాలన్న తపన అవతలి టీమ్‌లో ప్రతి ఒక్కరిలోనూ కనబడుతూంది.

వాళ్ళ స్కోరు 175—3 ఉండగా, చంద్రశేఖర్ నుంచి బంతి తీసుకొని ప్రకాష్ కిచ్చాడు కెప్టెన్. అప్పుడు బ్యాట్స్‌మన్ వివ్ రిచర్డ్స్. రైట్ హాండర్. ప్రపంచంలో కెల్లా రెండవ గొప్ప బ్యాట్స్‌మన్‌గా ప్రసిద్ధికెక్కిన వాడు. ఆట స్థలంలో కొద్దిగా నవ్వించేది అతడే. మిగతా వెస్టిండియన్స్ అందరూ చాలా సీరియస్‌గా ఉంటూ రెప్పుడూ.

వికెట్‌కి ఆరు గజాల దూరంలో నిలబడ్డాడు ప్రకాష్ బంతి పట్టుకుని...

రిచర్డ్స్ 'విసురు' అన్నట్టు సైగ చేసేడు. అప్పటికే అతడు డెబ్భై పరుగులతో ఉన్నాడు. జనం బాగా గోల చేస్తున్నారు. రిచర్డ్స్ ఆ రోజు ఆట పూర్తయ్యే లోపులో సెంచరీ సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు.

ప్రకాష్ గుండెనిండా గాలి పీల్చుకొన్నాడు. బంతిని తిప్పటానికి వీలుగా చూపుడువేలూ, మధ్య వేలూ మధ్య పట్టుకున్నాడు. అంపైర్ పక్కకి తొంగ్గానే పరుగెత్తుకుంటూ వచ్చి గుడ్ లెగ్త్‌లో వేసేడు. బంతి పడి స్పిన్ అయి, వికెట్ మీదకి వెళ్ళింది. అయితే అంతకు ఒక క్షణం ముందే బ్యాట్స్‌మన్ పొజిషన్‌లోకి వచ్చి కవర్స్‌లోంచి డ్రైవ్ చేసేడు. ఒక క్షణం బంతి కనపడలేదు. ఆ తరువాత ప్రేక్షకుల గోల మధ్యలో అది ఆకాశంలో కాకిలా ఎగురుతూ కనిపించి గాలరీలోకి వెళ్ళి పడింది.

సిక్స్!

'ఛీ' అనుకొన్నాడు ప్రకాష్. తన మీద తనకే అసహ్యం వేసింది. జీవితపు మొట్టమొదటి టెస్ట్ బంతి! ఆరు పరుగులు!!!

ఇంతలో అతడి చేతికి బంతి తిరిగి వచ్చింది. ఈసారి 'గుగ్లీ' వేయ దల్చుకున్నాడు. అదే అతడు చేసిన తప్పు! ఇంకా పూర్తిగా బంతి అలవాటు కాకుండానే గుగ్లీ వేయబోవటం! ఫలితం... అది ఫుల్ టాస్ అయింది. మళ్ళీ ఇంకో సిక్సరు!

ఓవర్ పూర్తయ్యేసరికి ఆరు బంతుల్లోనూ మూడు సిక్సర్లు, మూడు బవుండరీలతో రిచర్డ్స్ వంద పరుగులు పూర్తి చేసేడు. జనం పోలీసుల్ని దాటుకొని వచ్చి అతనిని అభినందిస్తున్నారు.

కొంత దూరంలో ఒంటరిగా—దాదాపు ఏడుపు తక్కువగా నిలబడి ఉన్నాడు ప్రకాష్. ఒక కుర్రాడెవడో అతడి మీద తినేసిన అరటిపండు తొక్క విసిరేసేడు. జనం అతడిని చూసి నవ్వుతున్నారు.

● ● ● ●

రాత్రి ఒంటి గంట అయింది. అతడికి నిద్ర పట్టలేదు. లేచి గదిలోంచి బయట కొచ్చాడు. చుట్టూ వెన్నెల. మధ్యలో అతడు ఒంటరిగా... నిశ్శబ్దంగా..

అతడికి తన గతం గుర్తొచ్చింది. తన తండ్రి బ్యాట్ పట్టుకోవటం నేర్పటం... చదువు కూడా లక్ష్యపెట్టకుండా క్రికెట్ ఆడటం... కృషి పట్టుదలా సాధనాలుగా ఎండలో చెమటతో నిర్విరామంగా చేసిన ప్రాక్టీసూ.

చేసినదంతా ఒక్క రోజులో పోయింది! ఆ దుఃఖం కేవలం అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. నిజమైన స్పోర్ట్స్‌మన్‌కే తెలుస్తుంది.

ఆ రోజు సాయంత్రం తిరిగి శైలజకీ, అతడికీ గొడవైంది. ఆ అమ్మాయిని స్నేహితురాళ్ళు ఎంతగా అల్లరి పట్టిస్తున్నారంటే— ఆమె వూరు తిరిగి వెళ్ళిపోతానంటుంది. బలవంతంమీద ఆపు చేశాడు. దాదాపు ఏడుస్తూ "బాటింగ్ అంటే భయం అనుకోవచ్చు. బవులింగ్ కేమయిందీ? హాయిగా వెయ్యొచ్చుగా" అంది. నిజమే! కానీ ఏదో అవుతూంది తనకి. ఏదో బెరుకు!

గవాస్కర్ లాంగ్ ఆన్‌లో నిల్చేమన్నప్పుడు ఆ బెరుకు తోనే నిలబడ్డాడు. తనకి కొద్ది గజాల దూరంలో శైలజ కూర్చుని ఉందని తెలుసు. ఇంతలో ముర్రే బంతిని గాలిలోకి లేపాడు. విపరీతమైన గొడవ. వెనుక శైలజ 'కాచిట్' అని అరుస్తుంది. పట్టుకోబోయే సమయానికి సూర్య కాంతి కళ్ళలో పడి వదిలేసేడు. ఎప్పుడూ కామ్‌గా ఉండే విశ్వనాథ్‌కూడా సీరియస్‌గా చూడటం తనకి బాధ కలిగించింది. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? అప్పటికే వెస్ట్ఇండీస్ 350—5 లో ఉన్నారు. ఓటమి తప్పనిసరి అవుతూంది. ఆ సాయంత్రం మళ్ళీ ఆమె అతడిని కలిసింది. ఆమె తిడుతూంటే మవునంగాభరించాడు. ఎంతోమంది తన దేశీయులకు ఆమె ప్రతినిధి అని అతడికి తెలుసు. దేశం మొత్తం తనని తిడుతున్నట్టు ఉంది. "నీ కసలు ఏం చేత కాదు" అంది శైలజ. "కేవలం రికమండేషన్ మీద టెస్ట్‌లోకి తీసుకున్నారు నిన్ను అంటున్నారు మా వాళ్ళు."

అప్పుడు మాత్రం ప్రకాష్ విలవిలలాడి పోయేడు. చాలా సున్నితమైన చోట తగిలిన దెబ్బ అది. గుండెనిండా వ్యథ. కళ్ళ నిండా నీళ్ళు.

● ● ● ●

ఆట నాలుగో రోజు లోకి ప్రవేశించింది. లాయిడ్ 575—7 దగ్గర డిక్లేర్ చేశాడు. ఒకటిన్నర రోజు పాటూ ఇండియా ఆడాలి. అప్పుడు ఇన్నింగ్స్ డిఫీట్ నుంచి తప్పించుకుంటుంది—అంతే! గెలిచే ప్రసక్తి లేదు—415 పరుగులు తీసి ఇంకా ఆ పైన ఎక్కువ చేయటం అసంభవం కాబట్టి.



19—8—81

లంచ్ పూర్తవగానే ఇండియా బ్యాటింగ్ ప్రారంభించాల్సి వచ్చింది.

గవాస్కర్‌తో కలిసి వికెట్ దగ్గిరికి నడుస్తూ అన్నాడు. "నేనూ: నేనూ, ఐ. ఐయాప్ సారీ?" గవాస్కర్ సున్నితంగా అతడి భుజం తడుతూ "పర్లేదు. జాగ్రత్తగా ఆడు" అన్నాడు ఆ సమయంలో ఆ రెండు మాటలూ అతడికి ఎంతో వోదార్పునిచ్చినాయి! ఆమాత్రం స్నేహ పూరితమైన స్పర్శ కోసం అతడు ఆ పరిస్థితుల్లో చాలా తపిస్తున్నాడు.

మొదటి వోవర్ పూర్తయింది. గవాస్కర్ పరుగులు చేయలేదు ఆ వోవర్లో. ఇక్కడ పరుగులు కాదు ముఖ్యం. మరుసటి రోజు సాయంత్రం వరకూ నిలబడగలిగితే చాలు. వోవర్ పూర్తవగానే ప్రకాష్ బ్యాటింగ్ వచ్చింది. ఈసారి ఆండీ రాబర్ట్స్‌ది బవులింగ్. చాలా పొడవుగా సీరియస్‌గా ఉండే రాబర్ట్స్ ఒకసారి ప్రకాష్ వైపు క్రూరంగా చూసేడు. అతడు విసిరిన బంతి తుపాకీ గుండు కన్నా వేగంగా వచ్చింది. ప్రకాష్ ఎడమ కాలు ముందుకు జరిపి, నెమ్మదిగా గ్లాన్స్ చేసేడు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య లెగ్‌స్లిప్ లోంచి బంతి బవుండరీ దాటింది. గవాస్కర్ అభినందిస్తున్నట్టు చెయ్యి వూపేడు. జనం చాలా సేపటి వరకూ చప్పట్లు కొడుతూనే ఉన్నారు. శైలజ అయితే కుర్చీలోంచి లేచి నిలబడి చెయ్యి వూపుతూంది.


ఇంతలో రాబర్ట్స్ రెండో బంతి వేసేడు. అతనెంత కర్కశంగా ఆ బంతి విసిరేడో, అంత సజావుగా దాన్ని లేట్ కట్ చేసేడు.

మళ్ళీ హర్షధ్వానాలు.

పళ్ళు బిగించి రాబర్ట్స్ వెనక్కి వెళ్ళాడు. అతడి ఫేవరిట్ బాల్! బవున్సర్! పడీ పడటంతోటే తారాజువ్వలా అరడుగుల ఎత్తు లేచింది. ఆ బంతి గానీ తగిలితే ప్రకాష్ చిన్న మెదడు బయటకు వచ్చేసేదే. కానీ ప్రకాష్ చులాగ్గా పక్కకి తప్పుకుని గాలిలోనే బంతిని బ్యాట్‌తో హుక్ చేసేడు. ఒక క్షణం అంతా నిశ్శబ్దం. బంతి వెళ్ళి స్టేడియంలో పడగానే జనం వేసే విజిల్స్, చప్పట్లతో స్టేడియం నిండిపోయింది. అతడి కిప్పుడు బంతి మామూలుగా కనిపించ సాగింది. అసలే మంచి స్ట్రోక్ ప్లేయరు. దానికి తోడు ఇదివరకు లేని ఆత్మవిశ్వాసం వచ్చి చేరింది. చాలా జాగ్రత్తగా ఆడసాగేడు. టీ టైమ్‌కి స్కోరు అరవై పరుగులకు చేరింది. ఆ మరుసటి రోజు నూరు పరుగుల దగ్గిర గవాస్కర్ అవుటయ్యాడు. వరసగా అమరనాథ్ విశ్వనాథ్‌కూడా అవుటవడంతో మళ్ళీ టెన్షన్ మొదలయింది. అప్పటికి స్కోరు 110—3.

టీ టైమ్‌కి పరిస్థితి మరింత విషమించింది—175—7. కిర్మానీ చాలాసేపు నిలబడగలిగేడు కానీ హుక్ చేయబోయి స్లిప్‌లో క్యాచ్ ఇచ్చేసేడు.

టైమ్ నాలుగయ్యేసరికి ప్రేక్షకులు కుర్చీ చివర్లకి చేరుకుని ఉద్వేగంతో చూడసాగేరు. తొమ్మిదో వికెట్ పార్ట్నర్‌షిప్‌లో చంద్రశేఖర్, ప్రకాష్ ఆడుతున్నారు. వోవర్ అయ్యేసరికి అంతవరకూ




ఆగగలిగినందుకు జనం చప్పట్లు కొడుతున్నారు. మళ్ళీ కొత్తది మొదలయ్యేసరికి ఉద్వేగం. వెస్టిండీస్ కెప్టెన్ లాయిడ్ మొహం సాయంత్రపు కాంతిలో కసితో మరింత నల్లగా మెరుస్తూంది. తన జట్టు బౌలర్లనందర్నీ ఒకరి తరవాత ఒకర్ని మారుస్తున్నాడు. అయిదు బంతు లాడటం, ఆరో బంతిలో ఒక పరుగు తీసి అటు వెళ్ళటం చేస్తున్నాడు ప్రకాష్. చంద్రశేఖర్‌ని సాధ్యమయినంతవరకూ బ్యాటింగ్ వైపు రాకుండా చేస్తున్నాడు. పరుగు తీసినప్పుడల్లా జనం ఉత్సాహ పరుస్తున్నారు. ఏ క్షణం అయినా ఆటస్థలం లోకి దూసుకు వచ్చేలా ఉన్నారు. పోలీసులు కాపలా కాస్తున్నారు.

నాలుగు...నాలుగుంపావు...

ఆఖరి మూడు వోవర్లు...రెండు...జనం టెన్షన్‌లో నిలబడి పోయారు. అరవటంకూడా లేదు.

గార్నర్‌ది ఆఖరి వోవరు. రాక్షసుడిలా బంతి పట్టుకుని వస్తున్నాడు. అప్పటికి దాదాపు అయిదు గంటలనుంచీ ఆడుతున్నాడు ప్రకాష్. చాలా నిస్సత్తువగా ఉన్నాడు. వరసగా నాలుగు బౌన్సర్లు. ఒక ఫుల్ టాస్ వేసేడు గార్నర్.

ఆఖరి బంతి.

బౌండరీ లైన్ దగ్గిరనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి విసిరేడు. ప్రకాష్ చాలా కామ్‌గా దాన్ని డ్రైవ్ చేసేడు. బంతి దొర్లుకుంటూ వెళ్ళిపోయింది.

అంతే. ప్రవాహం కట్టలు తెంచుకొన్నట్టు జనం...అభినందనలు...పోలీసులు... ప్రకాష్ వాళ్ళ సాయంతో డ్రెస్సింగ్ రూమ్ వైపు పరుగెత్తాడు. గవాస్కర్, విశ్వనాథ్ కంగ్రాచ్యులేషన్స్ చెబుతున్నారు.

పోటీ డ్రా అయింది.

● ● ●

"మార్వెలెస్! అసలు అప్పుడే నిన్ను ముద్దు పెట్టేసుకుందా మనుకున్నాను. కానీ అమ్మో జనం. నిజంగా హీరోవే అయిపోయావ్" అంటూంది శైలజ.

అతడి మొహం భావరహితంగా ఉంది. గెలుపు అతడిలో స్తబ్ధతని కలగ జేసింది. సక్సెస్ గంభీరతని ఆపాదించింది.

ఆమె మాట్లాడుతూంది. ప్రవాహం లాంటి మాటలు. పొగడ్తలు. ఫ్రెండ్స్ ఆమెని ఎలా కంగ్రాట్స్ చేసిందీ...వగైరా, వగైరా. అంతా విన్నాడు అతడు. చివరికి అన్నాడు:

"నేను నిన్ను ప్రేమించింది నువ్వు నా దుఃఖంలో పాలు పంచుకుంటావని. అంతేకానీ నా గెలుపులో కాదు. ఐయామ్ సారీ శైలజా. నేను నిన్ను ప్రేమించ లేను. ఏ వ్యక్తికైనా గెలుపూ, వోటమీ రెండూ తప్పవు. అందులోనూ స్పోర్ట్స్‌మన్ అంటే చిన్నపిల్లవాడి లాటివాడు. తల్లి తరవాత తల్లి లాటి ప్రేయసి ఒడిలో సేద తీర్చుకుందామనుకుంటాడు. ముఖ్యంగా వోడిపోయినప్పుడు."

ఆమె ముఖం వాడిపోయింది. లేచి నిలబడింది. ప్రకాష్ ఒక మాట అన్నాడూ అంటే అది ఆవేశంలో అన్నది కాదనీ, ఎన్నో నిర్ణయించుకునే అలా అంటాడనీ ఆమెకి తెలుసు. అతడు తలుపు తెరిచి పట్టుకొన్నాడు. ఆమె వెళ్ళిపోయింది.

అతడూ బయటి కొచ్చి రెండు చేతులూ పాంటు జేబుల్లో పెట్టుకుని శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాడు.

అతడికి తెలుసు—తన గెలుపు కిది ప్రారంభం అని! ఇక అంతా విజయ పరంపరే కావచ్చు. తన చుట్టూ ఇక జనం చేరతారు. అభినందిస్తారు. ఐ లవ్యూ అంటారు. తను కనుక్కోలేడు. ఎవరు తనని తనుగా నిజంగా ప్రేమిస్తున్నారో ఎవరు తన కళని ప్రేమిస్తున్నారో—ఎవరు తన గెలుపుని ప్రేమిస్తున్నారో!

ఎంత బాధామయ స్థితి ఇది! ★

**(ఈ కథలో పేర్లు కేవలం సౌలభ్యం కోసం ఉపయోగించుకోబడినవి.)**